క్లుప్తంగా

మండల మీట్ రేపు

నగరి (విజయపురం) : మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రం విజయపురం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, వివిధ విభాగాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

వెదురుకుప్పం: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శుక్రవారం శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లెమిట్టలోని దీపికా కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం గురువారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

రావణేశ్వర వాహనంపై కరకంఠేశ్వరుడు


రావణేశ్వర వాహనంపై కామాక్షీ సమేత కరకంఠేశ్వర స్వామి

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి గురువారం రావణేశ్వర వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. నూతన రావణేశ్వర వాహనాన్ని కస్తూరి కృష్ణారెడ్డి విరాళంగా అందించారు. తొలిసారి ఆ వాహనంపై స్వామివారు విహరించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ధ్వజా అవరోహణ కార్యక్రమం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి.

ఉపాధిహామీ పనుల పరిశీలన

పాలసముద్రం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. గురువారం ఆయన సింహరాజుపురం పంచాయతీలో జరుగుతున్న పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల విస్తరణాధికారి రమేష్, ఏపీఓ బాల, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణన్, కూలీలు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

శ్రీరంగరాజపురం : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ షెక్షావలి అన్నారు. మండలంలోని పిల్లారికుప్పం క్రాస్ వద్ద గురువారం సాయంత్రం వాహనలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రం లేని వాహనదారులకు చలానా వేశారు.

అవగాహన

గంగాధరనెల్లూరు: వేసవికాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో గురువారం అవగాహన కలిగించారు. వేసవిలో వైరల్ వ్యాధులైన చికెన్‌ఫాక్స్, మమ్స్, మీజిల్స్ వ్యాధులు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటే వారం రోజుల్లోపు తగ్గిపోతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

పర్యావరణ వినాశకారి ప్లాస్టిక్

పర్యావరణానికి అత్యంత హాని కలిగించే ప్లాస్టిక్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్వర్వులు క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి నీరుగారిపోతున్నాయి. పుత్తూరు పురపాలక సంఘంలో ఎటు చూసినా పాలిథిన్ కవర్ల వినియోగమే కనిపిస్తోంది. ప్రభుత్వాల నుంచి ఆదేశాలు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు తర్వాత పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం షరా మామూలే అవుతోంది.

- 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కవర్ల వినియోగంపై నిషేధం
- పుత్తూరులో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- క్షేత్రస్థాయిలో నీరుగారిపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు
- నిబంధనలు కఠినంగా అమలు చేయాలంటున్న పర్యావరణ నిపుణులు



నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో సరుకులు తీసుకెళ్తున్న మహిళలు, ప్రతి మనిషి చేతిలో ప్లాస్టిక్ కవరే..

పుత్తూరు రూరల్: క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నియంత్రణపై దృష్టి సారించాల్సిన అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తుండడంతో ఏ దుకాణం వద్దకు వెళ్లినా పర్యావరణానికి హాని అని రుజువైన ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తాయి. పుత్తూరులో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్ల వినియోగమే. గతేడాది డిసెంబర్ 31 వరకు 75 మైక్రాన్లు అంతకంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ సంచులను ప్రభుత్వం నిషేధించింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల మందం గల ప్లాస్టిక్ సంచులకే అనుమతించింది. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న సంచుల క్రయ విక్రయాలపై భారీ జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో అధికారులు దాడులు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, జరిమానా విధించారు. ఇదంతా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. మూడు నెలలు గడిచాయో లేదో మళ్లీ నిషేధిత పాలిథిన్ కవర్లు ప్రత్యక్షమవుతున్నాయి. ప్రతి మాంసపు దుకాణంలో, పండ్లు, పూలు, కిరాణా దుకాణాల్లో అంతటా ఈ కవర్ల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోంది. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలు నీరుగారిపోతున్నాయి. ఫలితంగా కాలువల్లో, చెత్తకుప్పల్లో పాలిథిన్ కవర్లు పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన వేడి ఆహార పదార్థాలను, ప్లాస్టిక్ కప్పుల్లో టీ, కాఫీలను తీసుకోవడం ద్వారా రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ వ్యర్థాలను మూగజీవాలు తిని కడుపులో జీర్ణం కాక బారినపడి మృతి చెందుతున్నాయి. రోజురోజుకు ప్లాస్టిక్ వినియోగం హెచ్చుమీరడంతో యావత్ మానవాళికే ప్రమాదకర పరిస్థితి దాపురిస్తోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేస్తున్నా, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అధికారులు, నిబంధనలను పాటించాల్సిన ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇకనైనా అందరూ కలసికట్టుగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్ క్యాన్సర్ కారకం..



ప్లాస్టిక్ కవర్‌లో ఉంచిన వేడి పదార్థాలను తీసుకోవడం ద్వారా విష వాయువులు శరీరంలోకి చేరుతాయి. ఫలితంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ప్లాస్టిక్ గ్లాసుల్లో వేడి పానీయాలు సైతం ప్రమాదకరం. మనం వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న ఆవులు, బర్రెలు మృత్యువాత పడుతుండడం చూస్తూనే ఉన్నాం. ప్లాస్టిక్‌ను పూర్తిగా వదిలేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా జీవించగలం.

– డాక్టర్ శంకర్ నరేష్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి, పుత్తూరు

ప్రజలు సహకరించాలి..



పుత్తూరు మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధాన్ని గట్టిగా అమలు చేస్తున్నాం. గత మూడు నెలల్లో రెండు టన్నుల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేశాం. రూ.35,500 జరిమానా విధించడం జరిగింది. ప్రస్తుతం అక్కడక్కడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతోందని తెలుస్తోంది. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల అమలులో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి.

– కేఎల్ఎన్‌రెడ్డి, కమిషనర్, పుత్తూరు మున్సిపాలిటీ

మీ సాయం మరువలేనిది


ఆపరేషన్ చేసుకున్న వారిని పరామర్శిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్‌కే రోజా ఎదుట కంటి ఆపరేషన్ చేసుకున్న వారి ఆనందం
- తొలివిడతలో 50 మందికి ఆపరేషన్లు
- కంటి ఆపరేషన్లు చేసుకున్న వారిని పరామర్శించిన మంత్రి

నగరి : ఉన్నచోటే కళ్లకు వైద్యం అందించి, ఇక్కడే ఆపరేషన్ చేయించిన మీ సాయాన్ని ఎన్నటికీ మరువమని మంత్రి ఆర్‌కే రోజా ఎదుట కంటి ఆపరేషన్ చేయించుకున్న పలువురు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి ఆర్కే రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరంలో గురువారం 50 మందికి ఆపరేషన్లు చేశారు. రూ.8.5 కోట్లతో శంకర్ నేత్రాలయ వారు సిద్ధం చేసిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా మైక్రో స్కోపిక్ స్మాల్ ఇన్‌సిషన్ అనే సరికొత్త పద్ధతిలో ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేయించుకున్న వారు తామున్న ప్రాంతంలోనే చికిత్స, ఆపరేషన్ కూడా ఇక్కడే చేయడంతో 'మీ సాయం మరువలేనిదమ్మా' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆపరేషన్ చేసుకున్న వారిని మంత్రి ఆర్కే రోజా పరామర్శించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు 250 మందికి కంటి పరీక్షలు చేయడంతో పాటు ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారిలో 50 మందికి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. శంకర్ నేత్రాలయ ప్రతినిధి అరుణ్ కుమార్ మాట్లాడుతూ శిబిరంలో కళ్లకు సంబంధించి 93 వ్యాధులకు పరీక్ష చేస్తున్నట్లు తెలిపారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ప్రతీష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'మా పెద్దబిడ్డలాగా చూసుకుంటున్నాడు'


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- సీఎం జగన్ సాయాన్ని మరువలేం
- డిప్యూటీ సీఎం ఎదుట సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల ఆనందం
- టీడీపీ, జనసేన నాయకులను నిలదీయండి
- ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ''అయ్యా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మమ్మల్ని మా పెద్ద బిడ్డలాగా చూసుకుంటున్నారు'' అని పలువురు లబ్ధిదారులు గురువారం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని తూర్పువీధి, రాజావీధి, సంపత్‌వీధి, గుండు గురుస్వామి వీధి, చిన్ననగర్ వీధుల్లో 5వ రోజు గురువారం సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీపీ లత, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలపై ఆయన ఆరా తీశారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఆయనతో మాట్లాడారు.

ఆర్థిక భరోసా కల్పించారు..

ఉప ముఖ్యమంత్రితో లబ్ధిదారు వళ్లెమ్మ మాట్లాడుతూ ''అయ్యా.. ఆర్థికంగా వెనుకడి, కాళ్లు లేని కొడుకుతో, వృద్ధాప్యంతో జీవిస్తున్నాం. అలాంటి మాకు మా పెద్దకొడుకులాగా జగన్‌మోహన్‌రెడ్డి నా ఇంటికి వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత పథకాలతో రూ.3.22 లక్షలు అందించి ఆర్థిక భరోసా కల్పించారు'' అని వివరించారు. దీంతో మంత్రి ఆమెను అభినందించారు. అదేవిధంగా తూర్పు వీధికి చెందిన శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ సంస్థానాధీశుల తర్వాత రాణిమహల్‌కు పూర్వ వైభవం కల్పించేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. అనంతరం కాసతోట వీధికి చెందిన మునిలక్ష్మి మాట్లాడుతూ 6 దశాబ్దాల కాలంగా పరిష్కరించని సమస్యను పరిష్కరించారని, సంక్షేమాలు అందిస్తూ అండగా నిలిచిన జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇలాంటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. ఎన్నికల సమయంలో పగటి వేషగాళ్లుగా వచ్చే టీడీపీ, జనసేన నాయకులను జగనన్నకు ఎందుకు ఓటు వేయకూడదని, తలుపు తట్టి పింఛన్లు ఇస్తున్నారని ఓటు వేయడం తప్పా.. లేకా ప్రతి సంక్షేమాన్ని మహిళల పేరుతోనే లక్షల రూపాయలు ఇవ్వడం తప్పా..? లేకా విద్యను ప్రోత్సహించడం తప్పా..? ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్య ఇవ్వడం తప్పా..? అని తల దించుకునేలా ధైర్యంగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్ మొదలియార్, మోహనకుమారి, ధనశేఖర్ మొదలియార్, మండల యువత అధ్యక్షుడు ధనశేఖర్ యాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయ్య, శేషాద్రి, చందురాజు, దొరబాబు, ఎంపీడీఓ మోహనమురళి, ఏడీఈ నాగరాజు, హౌసింగ్ ఏఈ యోగమూర్తి నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలువురు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆలయాల నిర్మాణం

కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణాలు నిర్మించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన కార్వేటినగరంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత 75 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాల నిర్మాణాలకు ఏ ప్రభుత్వం చొరవ చూపలేదని, అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణరావు చొరవతో నియోజకవర్గంలో 78 ఆలయాలు మంజూరు చేసి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు నిధులు విడుదల చేశారని గుర్తు చేశారు. అలాగే ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకు, అర్చకులకు రూ.5 వేలు అందిస్తున్న ఘనత కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. అదేవిధంగా 120 ఆలయాలు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయడం చేశామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, ఉప ముఖ్యమంత్రి చొరవతో దేవదాయశాఖ ఆధ్వర్యంలో త్వరలోనే ఆలయాల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'మా నమ్మకం నువ్వే జగన్'


గృహసారథులకు కిట్లను అందిస్తున్న జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి

శ్రీరంగరాజపురం: 'మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి అన్నారు. మండలవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన సూచించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్– జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో మన ప్రభుత్వం వచ్చాక జరిగిన అభివృద్ధితో పాటు గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాలను వారికి వివరించాలన్నారు. అదేవిధంగా కుటుంబ యజమాని అనుమతితో జగనన్న స్టిక్కర్లను అతికించి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించాలన్నారు. గృహసారథులు, వలంటీర్లను నిరంతరం ప్రజలతో కలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, నాయకులు జనార్దన్, కాలప్ప, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల స్ఫూర్తి ప్రదాత సీఎం జగనన్న


తిరుమణ్యంలో ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌రాజు

వడమాలపేట : నవరత్నాల పథకాలను పేదలకు అందిస్తూ స్ఫూర్తి ప్రదాతగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలుస్తున్నారని జెడ్పీటీసీ మాజీ సభ్యులు, మండల జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు అన్నారు. గురువారం ఆయన మండలంలోని తిరుమణ్యం, పత్తిపుత్తూరు, వడమాల సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహసారథులకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించి, కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని కోరారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా మన ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే మన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు గత టీడీపీ ప్రభుత్వ పాలన గురించి వారికి క్లుప్తంగా వివరించాలన్నారు. అలాగే కుటుంబ యజమాని అనుమతితో వైఎస్సార్‌సీపీ స్టిక్లర్లను అతికించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసి, ఎంపీటీసీ రవి, ప్రతిమ, స్థానిక నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, ధనుంజయులు, దీన, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేతో అర్హులకు న్యాయం


డ్రోన్ కెమెరా వినియోగంపై రైతులకు వివరిస్తున్న సర్వేయర్లు

పాలసముద్రం : జగనన్న సమగ్ర భూసర్వే (పీఏఎల్ఆర్)తో అర్హులకు న్యాయం చేకూరుతుందని తహసీల్దార్ బాబు, రెవెన్యూ డివిజన్ సర్వేయర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం భూసర్వేలో భాగంగా రామకృష్ణాపురం, పాలసముద్రం రెవెన్యూ గ్రామంలో డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహించారు. బాలకృష్ణాపురం, ఆముదాల రెవెన్యూ పరిధిలో 3550 ఎకరాలు, 250 సర్వే నంబర్లలోని భూములను డ్రోన్లతో సర్వే చేశారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న 21 రెవెన్యూ గ్రామాల్లో ఇదేవిధంగా డ్రోన్ కెమెరాలతో సర్వేచేయించి సర్వే నంబరు వారీగా పొలం గట్లను గుర్తించి మ్యాపింగ్ చేస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం తహసీల్దార్‌గా రఫీక్ అహ్మద్



కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా రఫీక్ అహ్మద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాయ చోటి తహసీల్దార్‌గా ఉన్న ఆయన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలతో పాటు రైతులకు, విద్యార్థులకు కావాల్సిన ధ్రువపత్రాలను తక్షణమే మంజూరు చేస్తామన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యసేవలు

- ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ వైద్యసిబ్బంది సేవలు అందిస్తారు
- ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో డాక్టర్ రవిరాజు


విజయపురం: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవిరాజు


ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

నగరి (విజయపురం) : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మీ చెంతకే వైద్యసేవలు అందించడం జరుగుతుందని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండల కేంద్రం విజయపురం సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వారికి వైద్యసేవలు అందించారు. ఆరోగ్యశ్రీలో వైద్యం పొంది విశ్రాంతి తీసుకుంటున్న వారిని వారి ఇళ్లవద్దకే వెళ్లి పరిశీలించి వారికి ఆరోగ్యపరమైన సలహాలు అందించారు. అత్యవసర కేసుల సిఫార్సు, ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోకి 104 వాహనంతో వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి అక్కడ ఉన్న విలేజ్ క్లినిక్, సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎంలు, మిడ్‌లెవల్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లతో కలిసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ విధానంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సచివాలయాల్లోను, మధ్యాహ్నం నుంచి గ్రామాల్లోని ఆస్పత్రులకు రాలేని వారికి, అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ విధానంలో నెలలో రెండుసార్లు 14 మంది సిబ్బంది సేవలు అందిస్తారని 67 రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉంచుతారన్నారు. 14 రకాల పరీక్షలను చేస్తారన్నారు. డాక్టర్ సోమశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు

నగరి : ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యసేవలు వచ్చాయని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. మండలంలోని గుండ్రాజుకుప్పం సచివాలయ పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలు 112 మందికి 14 రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ రమేష్, డాక్టర్ ప్రవీణ్, సర్పంచ్ బాలప్రసాద్, ఏఎన్ఎంలు, మిడ్‌లెవల్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సర్కారు వైద్యసేవలు

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లత పిలుపునిచ్చారు. గురువారం అన్నూరు సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని ఎంపీపీ లత ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయ వర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, చందురాజు, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ఇంటింటికీ వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. గురువారం మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా వైద్యసేవలను ప్రారంభించారు. వైద్యాధికారి ప్రవీణ, డీడీఓ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, అందరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్యం అందించాలన్నా ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకొచ్చిందని జిలా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల టెస్టులు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. తహసీల్దార్ లోకనాథపిళ్లై, వైద్యాధికారి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించడం మన అదృష్టం అని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలంలోని అత్తూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ రవిరాజు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్యులు, సిబ్బంది ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండుసార్లు వైద్యసేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారులు కల్యాణి, సుమలత, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంపీపీ అనితారెడ్డి తెలిపారు. మండలంలోని కోటానగరం పంచాయతీలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ లత, డీపీఎంఓ శ్రీనివాసరావు, తహసీల్దారు ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి, డాక్టర్లు షర్మిల, దుర్గాదేవి, సీహెచ్ఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పెనుమూరు(కార్వేటినగరం) : పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని మండల పార్టీ కన్వీనర్ విజయకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 14వ సచివాలయాల్లో ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి ×జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం జగన్∎ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ మేనిఫెస్టోను పవిత్రంగా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపే లక్ష్యంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుతున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, నాయకులు కృష్ణారెడ్డి, దాము, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.